# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 05-02-2025　　　　　　　సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ఈశాన్య రాష్ట్రాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు.
- ఢిల్లీ శాసనసభ ఎన్నికలలో దాదాపు 57.70 శాతం ఓటింగ్ నమోదైందని అధికారులు వెల్లడించారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు మహాకుంభమేళాలో పవిత్ర స్నానం చేశారు.
- దేశ అభివృద్ధిలో కృత్రిమ మేధ (AI) కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.
- భూమి, నీటి సంరక్షణ మీద ప్రజలలో అవగాహన పెరగాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు.

==========================

గత దశాబ్ద కాలంలో ఈశాన్య రాష్ట్రాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. 2 వేల 807 మందికి ఉద్యోగ నియామక పత్రాలను ఢిల్లీ నుంచి దృశ్య మాధ్యమం ద్వారా ఆయన ఈ రోజు అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అభివృద్ధి చెందిన భారత దేశంలో త్రిపుర భాగంగా ఉందని గుర్తు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈశాన్య రాష్ట్రాలలో అభివృద్ధి, అనుసంధానం, మౌలిక సదుపాయాలు వంటివి పెరిగాయని అమిత్ షా తెలియచేస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

==========================

ఢిల్లీ శాసనసభ ఎన్నికలలో ఈ సాయంత్రం 5 గంటల వరకు దాదాపు 57.70 శాతం ఓటింగ్ నమోదైందని అధికారులు వెల్లడించారు. 70 మంది సభ్యుల అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఈరోజు ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. అత్యధికంగా ఈశాన్య ఢిల్లీ జిల్లాలో 63.83 శాతం పోలింగ్ నమోదైంది. సౌత్ ఈస్ట్ జిల్లాలో 53.77 శాతంతో అత్యల్పంగా ఉంది. ఇదిలా ఉండగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, కేంద్రమంత్రులు డాక్టర్ ఎస్.జైశంకర్, హర్దీప్ సింగ్ పూరి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి అతీషి తదితరులు తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. కాగా ఢిల్లీ శాసన సభ ఫలితాలు ఈ నెల 8వ తేదీన వెలువడనున్నాయి.

==========================

ఓటు అనేది ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు అని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ పేర్కొన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా న్యూఢిల్లీలోని నార్త్ అవెన్యూ పోలింగ్ బూత్‌లో ఈ రోజు ఓటు హక్కుని ఆయన వినియోగించుకున్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... ఓటు హక్కు అన్ని హక్కులకు ప్రాథమికమైందని తెలిపారు. ప్రపంచంలోనే పురాతనమైన అత్యంత శక్తివంతమైన ప్రజాస్వామ్యం భారతదేశానిదని అన్నారు.

==========================

దేశ అభివృద్ధిలో కృత్రిమ మేధ (AI) కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. ఢిల్లీలో ఈ రోజు కేంద్ర మంత్రి ఓపెన్‌ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మన్‌తో AI మోడల్స్ గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన సురక్షితమైన రీతిలో కృత్రిమ మేధ వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ..

(వాయిస్ 37 సెకన్లు)

==========================

ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాలో భాగంగా త్రివేణి సంగమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు పవిత్ర స్నానం చేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి ప్రధానమంత్రి పడవలో అరైల్ ఘాట్ నుంచి త్రివేణీ సంగమానికి చేరుకున్నారు. గంగా, యమునా, సరస్వతి నదులు కలిసే చోట పుణ్యస్నానం ఆచరించిన అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రయాగ్ రాజ్ కి వచ్చిన భక్తులను నరేంద్ర మోడీ పలకరించారు. ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభమేళాలో పాలు పంచుకున్నందుకు ఆనందంగా ఉందని సామాజిక మధ్యమం ద్వారా ప్రధానమంత్రి పేర్కొన్నారు. త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానం అన్నది దైవిక సంబంధమైనదని అన్నారు. కోట్లాది మంది భక్తులతో పాటుగా తాను కూడా భక్తి స్ఫూర్తిని పొందానని పేర్కొన్నారు. గంగ అందరికీ శాంతి, జ్ఞానం, మంచి ఆరోగ్యం, సామరస్యాన్ని అనుగ్రహిస్తుందని నరేంద్ర మోడీ ఆకాంక్షించారు.

విరామం

==========================

సరైన ధ్రువపత్రాలు లేకుండా చట్టవిరుద్ధంగా తమ దేశంలోకి అడుగుపెట్టిన భారత పౌరులను ప్రత్యేక విమానంలో అమెరికా స్వదేశానికి పంపింది. దీంతో 205 మంది భారతీయులతో టెక్సాస్ నుంచి బయల్దేరిన అమెరికా సైనిక విమానం సీ-17 ఈరోజు అమృత్‌సర్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది. కాగా, ప్రత్యేక విమానంలో స్వదేశానికి వచ్చిన వారంతా పంజాబ్, దాని చుట్టుపక్కల రాష్ట్రాలకు చెందినవారని అధికార వర్గాలు తెలిపాయి. రానున్న రోజుల్లో మరిన్ని విమానాలు అమెరికా నుంచి భారత్‌కు రానున్నాయని సంబంధిత అధికారులు వెల్లడించారు.

==========================

భూమి, నీటి సంరక్షణ మీద ప్రజలలో అవగాహన పెరగాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కాంపోనెంట్ కింద ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి వాటర్‌షెడ్ యాత్రను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఢిల్లీలో ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వ్యవసాయ ఉత్పాదకత, జీవనోపాధి పర్యావరణాన్ని మెరుగుపరచడానికి ఈ యాత్ర దోహదపడుతుందని తెలిపారు. అలాగే సహజ వనరుల స్థిరమైన నిర్వహణ ప్రాముఖ్యతను సైతం అధికం చేస్తుందని కేంద్రమంత్రి వివరిస్తూ....

(వాయిస్ 35 సెకన్లు)

===========================

విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఈరోజు న్యూఢిల్లీలో యుఎన్‌జిఎ అధ్యక్షులు ఫిలిమోన్ యాంగ్‌తో సమావేశమయ్యారు. ఐక్యరాజ్యసమితి ఎజెండాలోని వివిధ అంశాలపై చర్చించామని కేంద్రమంత్రి ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం ద్వారా పేర్కొన్నారు. ప్రాంతీయ, ప్రాపంచిక పరమైన అభివృద్ధి అంశాలపై కూడా పరస్పరం అభిప్రాయాలను పంచుకున్నట్లుగా ఆయన తెలియజేశారు.

===========================

లిబియాలోని బెంఘాజీ నుండి 18 మంది భారతీయ పౌరులు తిరిగి స్వదేశానికి రావడానికి అక్కడి భారత రాయబార కార్యాలయం సౌకర్యాలు కల్పించింది. ఈ విషయాన్ని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి, రణధీర్ జైస్వాల్ సామాజిక మాధ్యమం ద్వారా తెలియజేశారు. లిబియాలో పనికి వెళ్ళిన 18 మంది భారతీయ పౌరులు చాలా వారాలుగా అక్కడ ఒంటరిగా ఉన్నారని పేర్కొన్నారు. వారిని క్షేమంగా తీసుకుని రావడానికి తగిన చర్యలను తీసుకున్నామని అన్నారు. కాగా, విదేశాల్లో ఉన్న భారతీయులందరి సంక్షేమం, భద్రతకు భారత ప్రభుత్వం కట్టుబడి ఉందని జైస్వాల్ స్పష్టం చేశారు.

===========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 78 వేల 584 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై.. చివరికి అమ్మకాల ఒత్తిడితో 312 పాయింట్ల నష్టంతో 78 వేల 271 వద్ద ముగిసింది. నిఫ్టీ 42.95 పాయింట్ల నష్టంతో 23 వేల 696 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ మరో 39 పైసలు క్షీణించి 87.46 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని తాకింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 75.53 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2 వేల 896 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

===========================

ఇస్మాయిలీ ముస్లింల నాయకుడు ప్రిన్స్ కరీం అగాఖాన్ మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. తన జీవితాన్ని ఆధ్యాత్మికతకు అంకితం చేసిన దూరదృష్టి గలవారని సామాజిక మాధ్యమం ద్వారా ఆయన పేర్కొన్నారు. ఆరోగ్యం, విద్య, గ్రామీణాభివృద్ధి మహిళా సాధికారత వంటి రంగాలలో కరీం అగాఖాన్ సహకారం అనేక మందికి స్ఫూర్తినిస్తూనే ఉంటుందని ప్రధానమంత్రి తెలిపారు.

===========================
===========================